


రెండో విడత రీ సర్వే వేగవంతం

సిసిఎల్ఎ జి.సాయిప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న రెండో విడత రీ సర్వే మరింత వేగవంతం కావాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ అన్నారు. రీ సర్వేపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రీ సర్వే పనులు వీలైనంత త్వరగా చేపట్టాలన్నారు. ప్రతి విడతలో డ్రాఫ్ట్ ఆర్ఒఆర్‌లు రికార్డు చేయాలన్నారు. అనంతరం ఫైనల్ ఆర్ఒఆర్‌లు రికార్డు చేసి ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. రీ సర్వేపై గ్రామసభలు నిర్వహించి, వీడియోను తీసి ఆర్‌డిఒ కార్యాలయంలో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, భూ సర్వే, రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోగిన ఎమ్మెల్సీ ఎన్నిక నగారా



- షెడ్యూల్ విడుదల
- మార్చి 13న పోలింగ్
- 16న ఓట్ల లెక్కింపు
- అమల్లోకి ఎన్నికల నియమావళి
- వేడెక్కిన రాజకీయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికకు సంబంధించి గతేడాది సెప్టెంబరులో ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. రాజకీయ పక్షాలు పోటాపోటీగా పట్టభద్రులతో ఓటర్లుగా నమోదు చేయించాయి. ఈ క్రమంలో అధికార వైసిపి అడ్డదారులు తొక్కిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు సైతం వెళ్లాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లాలో రాజకీయ వేడి ఒక్కసారిగా మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు, పోలింగ్‌కు పెద్దగా సమయం లేకపోవడంతో శుక్రవారం నుంచే ప్రచార రంగంలోకి దిగేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

అమల్లోకి ఎన్నికల నియమావళి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో గురువారం నుంచి ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వర్తిస్తుందని పేర్కొన్నారు. దీంతో జిల్లాలో కొత్తగా చేపట్టనున్న అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు బ్రేక్ పడనుంది.

51,186 మంది ఓటర్లుగా నమోదు

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలోని 30 మండలాల పరిధిలో ఇప్పటివరకు మొత్తం 51,186 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. నామినేషన్ల దాఖలు వరకు ఓటరుగా నమోదుకు అవకాశముందని అధికారులు చెప్తున్నారు. ఎన్నికల కోసం 59 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

షెడ్యూల్ ఇలా

నోటిఫికేషన్	ఫిబ్రవరి 16
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ	ఫిబ్రవరి 23
నామినేషన్ల పరిశీలన	ఫిబ్రవరి 24
నామినేషన్ల ఉపసంహరణ	ఫిబ్రవరి 27
పోలింగ్	మార్చి 13
(ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు)	
ఓట్ల లెక్కింపు	మార్చి 16
ఎన్నికల ప్రక్రియ ముగింపు	మార్చి 21

ఇలా అయితే ఎలా..?

- టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో జాప్యంపై స్పీకర్ అసహనం
- కాంట్రాక్టర్లపై చర్యలకు వెనుకాడవద్దు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఏళ్లు గడుస్తున్నా టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, అంతర్గత అభివృద్ధి పనుల్లో పురోగతి ఉండడం లేదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపాల్టీ పరిధిలోని జగ్గుశాస్త్రులపేట వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను, మంచినీటి సంపును, నీటి శుద్ధి కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. నిర్మాణాలు మందకొడిగా సాగడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తుంటే, అధికారులు ఎందుకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కాంట్రాక్టర్లపై తక్షణమే చర్యలు చేపట్టి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్లు అలసత్వం వీడాలన్నారు. నిర్మాణ పనుల నిరంతర, ప్రత్యక్ష పర్యవేక్షణకు ఇక్కడే టిడ్కో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి,



టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై అధికారులను ప్రశ్నిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రతిరోజూ తనకు పురోగతి నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలం హద్దులు గుర్తించి తగు రక్షణ చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో దురాక్రమణలను ఉపేక్షించవద్దన్నారు. హడావుడి మాటున నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం తలెత్తితే కాంట్రాక్టర్లపై ప్రభుత్వపరంగా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏప్రిల్ నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని, లేకుంటే నోటీసులు ఇచ్చి బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు, తహశీల్దార్ ఎస్.గణపతిరావు, టిడ్కో ఎస్ఇ డి.నర్సింహమూర్తి, డిఇ కె.సీతారాం, ఎఇలు ఐ.రమేష్, ఎస్.అనిల్, ఎలక్ట్రికల్ ఎఇ జి.రామారావు, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, దుంపల శ్యామలరావు, మామిడి ప్రభాకర్, ఎన్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడు? (6లో)

టోల్‌ప్లాజా కార్మికులకు ఉపాధి కల్పించాలి

కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం టోల్‌ప్లాజా మూసివేతతో రోడ్డున పడిన 106 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. టిడిపి ఎంపీ గల్లా జయదేవ్‌తో కలిసి గడ్కరీని ఆయన కార్యాలయంలో గురువారం కలిశారు. ఉపాధి కోల్పోయిన కార్మికులకు నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో గానీ, సారవకోట సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాలో గానీ సర్దుబాటు చేయాలని కోరారు. నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న నాలుగు లైన్ల హైవేను ఆరు లైన్లుగా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకు ఆరు లైన్లుగా మార్చడం వల్ల శ్రీకాకుళం జిల్లాకు మేలు చేకూరిందని చెప్పారు. జాతీయ రహదారి మీదుగా శ్రీకాకుళం నగరంలోకి రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నవభారత్ కూడలి వద్ద అండర్ పాసేజ్‌ను నిర్మించాలని కోరారు.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి సమస్యలను వివరిస్తున్న రామ్మోహన్ నాయుడు

విద్యార్థులకు ఫోర్టిఫైడ్ బియ్యం

ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తోందని ఆహార కమిషనర్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఆహార భద్రతా చట్టం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఆహార భద్రతా చట్టం పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఆహార కమిషన్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ఆహార భద్రత చట్టం అమలుపై అధికారులు పూర్తి శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం వాంబే కాలనీ వద్ద ఎండియు వాహనం ద్వారా విక్రయిస్తున్న బియ్యాన్ని తనిఖీ చేశారు. గూనపాలెం సెక్టార్, దండివీధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిల్లలకు తయారు చేసిన ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఒప్పంగిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ఆహారానికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే 9966242414 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేసే అక్షయపాత్ర సెంట్రలైజ్డ్ కిచెన్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వెంకటరమణ, పౌరసరఫరాల సంస్థ డిఎం జయంతి, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, ఐసిడిఎస్ పీడీ కె.అనంతలక్ష్మి, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న అధికారులు

తీర్థయాత్రలకు 'భారత్ గౌరవ్' రైలు

ఐఆర్‌సిటిసి సౌత్ సెంట్రల్ మేనేజర్ చంద్రమోహన్

ప్రజాశక్తి - ఆమదాలవలస

తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే యాత్రికుల కోసం భారత్ గౌరవ్ టూరిస్టు రైలును నడపనున్నట్లు ఐఆర్‌సిటిసి సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా మేనేజర్ బి.చంద్రమోహన్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లోని విఐపి లాంజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం, విజయనగరం మీదుగా ప్రయాగ్ రాజ్ వరకు నడపనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా యాత్రికులు విశాఖపట్నం గానీ విజయనగరం రైల్వేస్టేషన్‌లో గానీ ఎక్కాల్సి ఉంటుందని చెప్పారు. మార్చి 18న మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రి ఒంటి గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని చెప్పారు. పూరి, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సందర్శించి 25వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని వివరించారు. ఏడు రాత్రులు, ఎనిమిది రోజుల టూర్ ప్యాకేజీకి సంబంధించి ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ రూ.15,300, ఐదు నుంచి 11 ఏళ్ల లోపు పిల్లలకు రూ.13,060, థర్డ్ ఎసి ఒక్కొక్కరికి రూ.24,085, పిల్లలకు 21,460, సెకండ్ ఎసి ఒక్కొక్కరికి రూ.31,510, పిల్లలకు రూ.28,360 చొప్పున నిర్ణయించినట్లు తెలిపారు. స్లీపర్ క్లాస్ యాత్రికులకు నాన్ ఎసి గదులు, థర్డ్, సెకండ్ ఎసి యాత్రికులకు ఎసి గదుల్లో బస ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాత్రికులకు ఉదయం టీ, టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి శాఖాహార భోజనం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తొలిసారిగా ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో అత్యాధునిక సౌకర్యాలతో ఈ రైలును నడుపుతున్నట్లు తెలిపారు. మొత్తం 636 మంది యాత్రికులు ప్రయాణించే ఈ రైలు ప్రతి బోగీకి సెక్యూరిటీ గార్డు, ఐఆర్‌సిటిసి సూపర్‌వైజర్ పర్యవేక్షణలో పూర్తి భద్రత, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. టూర్ ప్యాకేజీకి సంబంధించిన వివరాలను https ://www.irctctourism.com వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. 8287932318, 08912500695 నంబర్లకు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. సమావేశంలో స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జి.వి ప్రసాదరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఆర్‌సిటిసి సౌత్ సెంట్రల్ ఏరియా మేనేజర్ చంద్రమోహన్

ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

- 16న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగపాలక సంస్థతో పాటు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఉద్యోగులు, ఒప్పంద కార్మికుల జీతాలు, ఉద్యోగాలకు ఎసరుపెట్టే ఎపి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని కోరుతూ ఈ నెల 16న మున్సిపల్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కోరారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికుల పోరాటానికి సంబంధించిన కరపత్రాన్ని తేజేశ్వరరావుతోపాటు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎ.గణేష్, ఎస్.బలరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2022 జులై 11 నుండి 15వ తేదీ వరకు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఇప్పటివరకు అమలులో ఉన్న హాజరు విధానం స్థానంలో కొత్త విధానాన్ని(ఎపిఎఫ్ఆర్ఎస్) జనవరి 16 నుంచి అమలు చేస్తోందన్నారు. ఈ విధానం ద్వారా ఎవరి సెల్‌ఫోన్‌లో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫొటో తీసి యాప్ ద్వారా హాజరు పంపించాలని జిఓ విడుదల చేశారన్నారు. మున్సిపల్ కార్మికుల్లో అత్యధిక మంది చదువురాని వారు ఉన్నారని, కొందరికి స్మార్ట్ ఫోన్లు కూడా లేవని, ఉన్న వారికి వినియోగించడం చేతకాదన్నారు. ఇలాంటి స్థితిలో ఎఫ్ఆర్ఎస్‌ను ప్రభుత్వం నిర్దేశించడం కార్మికులను వీధులపాలు చేయటమేనని విమర్శించారు. 4, 5 రోజులు హాజరుపడకపోతే వారిని ఉద్యోగం నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులకు, కలెక్టర్‌కు సామూహిక రాయబారాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 16న మున్సిపల్ కార్యాలయాల వద్ద ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కళ్యాణ రాజు, డి.చిట్టి, ఎ.జనార్ధనరావు, ఎ.శేఖర్, జె.మాధవి, జె.రమేష్, ఎ.రాము, రాజేష్, రాజశేఖర్, ఎన్.వెంకటరమణ, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తేజేశ్వరరావు, మున్సిపల్ కార్మికులు

వైసిపికి ఓటమి ఖాయం

- ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం
- మంత్రి ధర్మాన చెప్పేది, చేసేది అధర్మమే
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటమి ఖాయమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన టిడిపి విస్తృత స్థాయి సమావేశంలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వి.చిరంజీవిరావును పరిచయం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోసం గత ఎన్నికల ముందు ప్రజలకు చెప్పిన అబద్ధాలనే మళ్లీ ఈ సారి కొత్తగా చెప్పేందుకు వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని, జగన్‌తో పాటు కూటమిలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల మొదలు నాయకుల వరకు ఒకే అబద్ధాన్ని మళ్లీ మళ్లీ చెప్పి నిజమని నమ్మిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అధికారం కోసం అందరికంటే ముందుగా ఉద్యోగులకు అనేక రకాలైన వాగ్ధానాలు చేసి నమ్మించారన్నారు. సిపిఎస్ మొదలు పిఆర్‌సి వరకు అన్నింటా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మోసపోయారన్నారు. ఉద్యోగాలు కల్పన, పారిశ్రామిక అభివృద్ధి అడుగంటి పోయిందని, దీనివల్ల యువత మోసగించబడ్డారన్నారు. జగన్మోహన్‌రెడ్డి చెప్పిన జాబ్ క్యాలండరు ఏమైందో యువత ప్రశ్నించాలన్నారు. జిల్లాలో 50శాతం కూడా ధాన్యం కొనుగోలు చేయలేదని, దీంతో కళ్లాలు, పొలాల్లోనే ధాన్యం నిల్వలు ఉన్నాయని అన్నారు. మత్స్యకారులకు అండగా నిలస్తానని నమ్మబలికి అప్పలరాజును మంత్రిని చేశారని, ఆయన మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించారని చెప్పారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 14న స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, ఏ నియోజకవర్గంలో ఎప్పుడు నిరసనను ఎలా చేపట్టాలో చర్చిస్తామన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన పేరులో ఉన్న ధర్మం పని లేదన్నారు. తన ఆస్తులను కూడ బెట్టుకునేందుకు ప్రత్యేకంగా ఒక రాజధాని కావాలంటున్నారని విమర్శించారు. ఆయన ఉంటున్న పెద్దపాడు ప్యాలెస్‌ను రాజధాని చేయాలన్నా ఆశ్చర్యం అక్కర్లేదన్నారు. వాలంటీర్లను గతంలో రెగ్యులర్ చేస్తామన్న హామీని ఎంతవరకు నిలబెట్టుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వి. చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా తనకు 12 ఏళ్ల సర్వీసు ఉన్నా ప్రజా సేవే లక్ష్యంతో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, రాజు, మాజీ ఎమ్మెల్సీ నాగరాజు, గౌతు శిరీష, చౌదరి ధనలక్ష్మి, పి.విఠల్, చౌదరి బాబ్జీ, కె.రామ్మల్లిక్‌నాయుడు, సుధాకర్, గొండు శంకర్, టి.వెంకన్నయాదర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూన రవికుమార్

ఎన్నికల కో-ఆర్డినేటర్లు నియామకం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కో-ఆర్డినేటర్లను టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రకటించారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జామి భీమశంకర్, విశ్రాంత సబ్ కలెక్టర్ పిఎంజె.బాబు, బొణికి భాస్కరరావును నియమించారు.

మహా శివరాత్రికి పక్కాగా ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఆర్‌డిఒ బి.శాంతి

ప్రజాశక్తి - జలుమూరు

మహా శివరాత్రిని పురస్కరించుకుని శ్రీముఖలింగంలో గల శ్రీముఖలింగేశ్వర ఆలయంలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలకు ఘనంగా నిర్వహించాలని శ్రీకాకుళం ఆర్‌డిఒ బి.శాంతి అధికారులను ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది అధిక సంఖ్యలో యాత్రికులు దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు. గతానుభవాలు, లోటుపాట్లను దృష్టిలో పెట్టుకుని ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈనెల 12 నుంచే పనులు ప్రారంభించి 17వ తేదీ నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం 1.40 గంటలకు చక్రతీర్థ స్నానాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చక్రస్నానాల సమయంలో భారీసంఖ్యలో యాత్రికులు వస్తారని, ఎటువంటి తొక్కిసలాట కాకుండా పోలీస్, ఆర్అండ్‌బి అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. దర్శనానికి వచ్చే వారికి ఆలయానికి చేరుకునే దారి, సులువుగా బయటకు వెళ్లేందుకు ఐరన్ బ్యారికేడ్లు, క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారాన్ని తీసుకోవాలన్నారు. చక్రస్నానాల ఘట్టం నిర్వహించేందుకు నదిలో సరిపడా నీటిని విడుదల చేయాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. యాత్రికుల సౌకర్యార్థం ఆయా రూట్లలో ఆర్‌టిసి బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టాలని ఆర్‌టిసి డిపో మేనేజర్‌ను ఆదేశించారు. అత్యవసర సమయంలో చికిత్స అందించేందుకు అవసరమైన వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. సమావేశానికి ఎలక్ట్రికల్ ఎఇ హాజరు కాకుండా లైన్‌మెన్ హాజరు కావడంపై ఆర్‌డిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమైన ఉత్సవాలకు సంబంధించిన సమావేశానికి ఎలా గైర్హాజరవుతారని ప్రశ్నించారు. ఎలక్ట్రికల్ డిఇ, ఎఇ తన కార్యాలయానికి వచ్చి కలవాలన్నారు. అనంతరం ఆర్‌డిఒ శాంతి, పలాస డిఎస్‌పి ఎం.శివరాం రెడ్డి శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్నారు. సమావేశంలో ఆలయ పాలకమండలి చైర్మన్ పి.లింగమూర్తి, ఆలయ ఇఒ పి.ప్రభాకరరావు, ఎంపిపి వి.గోపి, జెడ్‌పిటిసి ప్రతినిధి రాంబాబు, ఎంపిటిసి హరిప్రసాద్, సర్పంచ్ టి.సతీష్ కుమార్, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ జి.వి రవికుమార్, వైద్యాధికారులు టి.శ్రీకాంత్, కె.అప్పారావు, పి.గురునాథరావు, నరసన్నపేట సిఐ డి.రాము, జలుమూరు, సరుబుజ్జిలి ఎస్ఐలు పి.పారినాయుడు, కె.కృష్ణప్రసాద్, అగ్నిమాపక అధికారి ఎన్.బుచ్చోడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శాంతి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

మంత్రి అప్పలరాజును కోరిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతు దగ్గర ఉన్న ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీదిరి అప్పలరాజును సిపిఎం నాయకులు గురువారం కోరారు. గురువారం నగరంపల్లిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రిని సిపిఎం ప్రతినిధి బృందం కలిసింది. వారు మాట్లాడుతూ రైతు వద్ద ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరించడం వల్ల పొలాల్లో, కళ్లాల్లో ధాన్యం నిల్వలు నెలలు తరబడి ఉండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార నీరు శివారు భూములకు ఇవ్వకుండా నీటి తీరు వసూలు చేయడం సమంజసం కాదని దీన్ని నిలుపుదల చేయాలని కోరారు. వసూలు చేసిన నీటి తీరువాను తిరిగి రైతులకు ఇచ్చేయాలని కోరారు. గత రెండు సంవత్సరాలకు పంటలు పండలేదని, రైతులకు పంటల భీమా వర్తింపచేయలని కోరారు. కార్యక్రమంలో బమ్మిడి శ్రీరాములు, నెయ్యిల మోహన్‌రావు భాస్కర్‌రావు, దుబ్బ భాస్కరరావు, భానుమతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు


తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

పలాస : పలాస రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు రైళ్లలో ప్రయాణిస్తున్న అనుమానిత ప్రయాణికులను విచారించి, విస్తృత సోదాలు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పలు రైళ్లలో ప్రయాణిస్తున్న అనుమానిత ప్రయాణికులను, రైలు నుంచి దించి వారి వద్ద ఉన్న బ్యాగులను సోదాలు చేశారు. గంజాయి, గుట్కా, ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు విభాగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిఆర్‌పి ఎస్‌ఐ షేక్ షరీఫ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణా నేరమని, దీంతోపాటు మానవ అక్రమ రవాణాపై గట్టిగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై అనుమానిత ప్రయాణికులను విచారిస్తున్నట్లు చెప్పారు. రైల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారు ఇచ్చిన తినుబండారాలు తీసుకోవద్దని హెచ్చరించారు. అనంతరం స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కోదండరావు, సిబ్బంది భాస్కరరావు, శ్రీనివాస్, గిరి, ఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు

పూర్తయ్యేదెప్పుడు?

- సూదికొండలో పునాదులతో నిలిచిపోయిన వైనం
- నివాసాల్లో నడుస్తున్న హెల్త్ సెంటర్లు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, రోగులు


సూదికొండలో పునాదులతో నిలిచిపోయిన పనులు

ప్రజాశక్తి- పలాస

పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా భవనాలను మంజూరు చేసింది. ఏడాదిన్నర కావస్తున్నా భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ అద్దె నివాస గృహాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సూదికొండ ప్రాంతంలో హెల్త్ సెంటర్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. మొగిలిపాడు, సూదికొండ, జగనన్న కాలనీలో ఒక్కొక్క అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం రూ.80 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు మాత్రం అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. ఒక వైపు అర్బన్ హెల్త్ సెంటర్లు త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రారంభించి రోగులకు వైద్య సేవలు అందించాలని ఉన్నత అధికారులు చెబుతున్నారు. కిందిస్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించడంతో నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ప్రస్తుతం మొగిలిపాడు, రామకృష్ణపురం జగనన్న లేఅవుట్‌లో


శివాజీ నగర్‌లో ఇంట్లో నడుస్తున్న హెల్త్ సెంటర్

పనులు జరుగుతున్నాయి. సూదికొండ ప్రాంతంలో పునాదులతో పనులు నిలిచిపోయాయి.

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలో నర్సిపురం, శివాజీ నగర్, హాట్కో కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అవి కూడా నివాసగృహాలు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న మందులు, సామగ్రి ఉంచేందుకు స్థలం సరిపోవడం లేదు. మరోవైపు రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేలకు వేలు భవనాలకు అద్దెలు చెల్లిస్తున్న పూర్తి స్థాయిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నివాస గృహాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు పెట్టడం ద్వారా మున్సిపాలిటీ ప్రజలకు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయా? అనే విషయమూ తెలియని పరిస్థితి. ఏదేమైనప్పటికీ నివాస గృహాల్లో హెల్త్ అర్బ సెంటర్లో నిర్వహించడం ద్వారా రోగులకు, వైద్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. అర్బన్ హెల్త్ సెంటర్లకు పక్కా భవనాలు లేకపోవడం వల్లే ఇటువంటి ఇబ్బందులు వస్తున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. త్వరితగతిన అర్బన్ హెల్త్ సెంటర్లో భవనాలను పూర్తి చేసి ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలతో పాటు వైద్య అధికారులు కోరుతున్నారు. ఈ విషయంపై మొగిలిపాడు, జగనన్న లేఅవుట్‌లో అర్బన్ హెల్త్ సెంటర్లు ఫిబ్రవరి నెలాఖరి నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. సూదికొండలో త్వరలోనే పనులు ప్రారంభించి మార్చి నాటికి పూర్తి చేసి అర్బన్ హెల్త్ సెంటర్లకు అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారు.

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండల కాంప్లెక్స్‌లో తాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా సురక్షిత తాగునీటి పథకం ఏర్పాటు చేసినట్లు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండల కాంప్లెక్స్ లో ప్రభుత్వ కార్యాలయాలకు తాగునీరు అందించడానికి రూ. 13 లక్షల తో ఏర్పాటు చేసిన శుద్ధిజల తాగునీటి పథకాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. అప్పలరాజు మాట్లాడుతూ మండల కాంప్లెక్స్‌లో తాగునీటి ఇబ్బందులు మండల వ్యవస్థ ఏర్పాటు నుండి ఉన్నాయని అన్నారు. తాగునీటి సమస్య కారణంగా ఇక్కడ పని చేయడానికి ఉద్యోగులు వెనకడుగు వేసే పరిస్థితి ఉండేదన్నారు. ఇక్కడ భూగర్భ జలాలు లేకపోవడం, నీరు పడినా ఉప్పు నీరు కావడంతో వజ్రపుకొత్తూరులో బోరు వేసి ప్రతి కార్యాలయానికి నీరు అందించే బృహత్తర కార్యక్రమం ఇది అన్నారు. ఈ పథకం ఏర్పాటులో విశేషంగా కృషి చేసిన మండల టీమ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాలిన శ్రీనివాస్, ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, ఎంపిడిఒ సిహెచ్ ఈశ్వరమ్మ, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఉదయ్‌కుమార్, పి.గురయ్యానాయుడు, బాలరాజు, కె.మల్లేశ్వరరావు, మామిడి భాస్కరరావు, పైల అప్పారావు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి


ప్రసాదరావు

రైతులు పండించే ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలాకి ప్రసాదరావు డిమాండ్ చేశారు. గురువారం చాపరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. రైతులకు సకాలంలో డబ్బులు పడకపోవడంతో తేమ శాతంతో నష్టపోతున్నారని చెప్పారు. దూరపు ప్రాంతాలకు ధాన్యం తీసుకెళ్లి అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందదన్నారు. ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

క్రైమ్ కార్నర్

కళాసీ దారుణ హత్య

ప్రజాశక్తి- కోటబొమ్మాళి


గవరయ్య మృతదేహం

మండలంలోని మూలపేట గ్రామానికి చెందిన మట్ట గవరయ్య(35) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం... కోటబొమ్మాళిలోని శ్రీ లక్ష్మి శ్రీనివాస్ ట్రేడర్స్ అం డ్ రైస్ మిల్లులో కళాసీగా పని చేస్తున్న గవరయ్య రోజూ మాదిరిగానే పనికి వెళ్లాడు. టివిఎస్ వాహనంతో బుధవారం మధ్యాహ్నం భోజనం చేసి, మరలా మిల్లుకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గవరయ్యకు ఫోన్ చేశారు. అది పని చేయలేదు. ఆయనతో కళాసీగా పని చేస్తున్న ఎన్.అప్పన్నకు ఫోన్ చేశారు. రాత్రి 8గంటలకే అందరం వెళ్లిపోయామని, ఏవైనా పనులు ఉంటే చూసుకొని వస్తాడని చెప్పారు. రాత్రి 10గంటలైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువులకు ఫోన్‌చేసి వెతక సాగారు. బంజీరుపేట, లకంరెడ్డి గ్రామాల మధ్య గవరయ్య మృతదేహాన్ని స్థానికులు గురువారం ఉదయం గుర్తించారు. విషయం తెలుసుకున్న మృతుని భార్య శ్రీదేవి, కుమారుడు చిన్నారావు, కుమార్తె,తల్లి సర్వస్వతి, కుటుంబసభ్యులు ఘటనా స్థలికి చేరుకొని రోదించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ ఘటనా స్థలిని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు గవరయ్య పీక కోసి చంపినట్లు గుర్తించారు. హత్య ఎవరు చేశారు, అందుకు కారణం ఏమిటన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. గవరయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తికి గాయాలు

మెళియాపుట్టి : మండలంలో మర్రిపాడు వద్ద గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముకుందపురానికి చెందిన ఎస్.సనియాడు గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై మెళియాపుట్టి వైపు వస్తుండగా గ్రానైట్‌కు సంబంధించిన కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అరెస్టు

మెళియాపుట్టి : మెళియాపుట్టిలో గురువారం వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీలో నందిగాం మండలం బనియాకు చెందిన సవర నర్సింగులు బైక్‌పై 4,700 విలువ గల 30 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పట్టుబడ్డాడు. దీనిపై ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో విఆర్‌ఒ మృతి


సత్యనారాయణ మృతదేహం

టెక్కలి రూరల్: గ్రామ సచివాలయం-3లో విఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్న తమ్మినేని సత్యనారాయణ (55) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. టెక్కలి రెవెన్యూశాఖ ఉద్యోగిగా ఉన్న సత్యనారాయణ సచివాలయం-3 పరిధిలో విఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతిపై నచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

కెజిబివి ఉపాధ్యాయుల నిరసన


బూర్జ : ప్రభుత్వ నిర్ణయంతో కాంట్రాక్టు, రెసిడెన్షియల్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే తమకు ఎంటిఎస్ విధానం అమలు రేయాలని కస్తూరిబా ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు మండలంలోని కొల్లివలస కెజిబివి వద్ద గురువారం ఉపాధ్యాయులు నల్లరిబ్బన్లను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లుగా జీతాలు పెంచకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో 23 శాతం వేతనం పెంచుతున్నట్లు ప్రకటించడం సరికాదన్నారు. గత నిర్ణయం ప్రకారం రూ.12 వేలు వేతనం పెరగాల్సి ఉందని, ఇప్పుడు రూ.ఐదు వేలు లోపు జీతాలు పెరుగుతాయని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నామని, తమకు న్యాయం చేయాలని కోరారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఈశ్వరరావు

విద్యార్థులకు అభినందనలు

రణస్థలం రూరల్: సిబిఎస్ఇ నిర్వహించిన అర్యబట్ట గణిత ఛాలెంజ్-2022లో ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మేరకు సౌత్ జోన్‌లో మొదట వంద ర్యాంకుల్లో దిషంత్, వెలిచేటి శివభార్గవి, భావన నిలిచారు. స్కూల్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజ విద్యార్థులను ప్రశంసించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తలుచుకుంటే అసాధ్యం కానిది ఏది లేదని మరోసారి నిరూపించారని అన్నారు. ఇప్పటి నుంచే ఉన్నత శిఖరాలు అవరోధించేందుకు విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలన్నారు. విద్యార్థులకు చక్కటి శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయులను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు జ్యోతి, ఆనంద్, రాకేష్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ద్రోహి అచ్చెన్నాయుడు


చింతాడ మంజు

టెక్కలి రూరల్: ఉత్తరాంధ్ర ద్రోహి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం పరిపాలన రాజధానిగా వైసిపి చేస్తానంటే టిడిపి అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు. టిడిపికి 160 సీట్లు వస్తాయని ప్రగల్బాలు పలుకుతున్నారని అన్నారు. టెక్కలిలో అచ్చెన్నకు ఓటమి ఖాయమని అన్నారు. జగనన్న సంక్షేమ పాలనను మెచ్చి ప్రజలు 175కు175 కట్టబెడతారని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైఎస్ఆర్ జగనన్న కాలనీ లే అవుట్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఉగాది నాటికి జరుపతలపెట్టిన సామూహిక గృహ ప్రవేశాలకు తగు చర్యలు చేపట్టాలని మెప్మా పీడీ, గాజులకొల్లివలస లే అవుట్ ప్రత్యేక అధికారి ఎం.కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.అప్పలనాయుడు అధ్యక్షతన వార్డు సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు, మెప్మా సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి ముందుకువచ్చేలా చూడాలన్నారు. లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లుల చెల్లింపులో సమయాభావం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లబ్ధిదారులలో స్వయం సహాయక సంఘాల సభ్యులు కోరితే రూ.35 వేల అదనపు రుణం కల్పిస్తామని చెప్పారు. పట్టణ పరిధిలోని తిమ్మాపురం, గాజులకొల్లివలస, చింతాడ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు తగిన అన్ని మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. స్వయంగా లబ్ధిదారులే పరిశీలించుకుని నిర్మాణాలకు ఉపక్రమించాలని కోరారు.


మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ఊరు మధ్యలో డంపింగ్ యార్డు వద్దు


వినతిపత్రం అందిస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ధర్మాపురంలో ఒక వైపు ఆరోగ్య కేంద్రం నిర్మాణం, మరోవైపు జనసంచారం మధ్యలో నిర్మిస్తున్న డంపింగ్ యార్డును నిలిపివేయాలని గ్రామస్తులతో పాటు జనసేన నాయకులు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును ఊరికి దూరంగా నిర్మించాలని కోరుతూ ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జనసేన నియోకజవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డు వల్ల చిన్న పిల్లలకు, ప్రజలకు ప్రాణ హాని ఉందన్నారు. కార్యక్రమంలో రోకళ్ల భాస్కర్, గ్రామస్తులు పైల హేమరాజు, ఎంపాడా మొహంతు, పైల పురుషోత్తం, పిట్ట రామకృష్ణ, పైల ఆది, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులపై సబ్సిడీ ఇవ్వాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఎరువులపై ఇచ్చే సబ్సిడీ రూ.7వేల కోట్లను తగ్గించిందని, రైతులకు గిట్టుబాటు ధరపై చట్టం చేయకపోవడం వల్ల దళారీలు, ప్రైవేట్ వ్యక్తుల దోపిడీకి గురవుతున్నారని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ప్రసాదరావు అన్నారు. గురువారం టెక్కలిలో నిరసన చేపట్టారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతుధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం కొనుగోలు బాధ్యత తీసుకోకుండా ఇతరులపై పెట్టడం వల్ల రైతులు మరింత దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీకి నిధులు కుదించడం దారుణమన్నారు. కార్మికులకు పనులు తగ్గి, వలసపోయే పరిస్థితి ఏర్పడనుందని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.సాంబమూర్తి, ధర్మారావు, వ్యకాస నాయకులు కొల్లి ఎల్లయ్య, సుబ్రహ్మణ్యం, రమేష్, ప్రసాద్, వనజాక్షి, ఎన్.షణ్ముఖరావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కౌలు రైతులు


ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రవికుమార్

'కిల్కారి'పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పోలాకి

మాతాశిశు మరణాల నివారణకు కేంద్ర ప్రభుత్వం కిల్కారి పేరుతో నూతన వ్యవస్థను ఏర్పాటు చేసిందని, దీనిపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన అవసరమని డాక్టర్ శ్రీనాథ్ అన్నారు. పిహెచ్‌సి విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ ఆధ్వర్యాన గురువారం కిల్కారి మొబైల్ సేవపై ఆరోగ్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. మాతాశిశు మరణాల నిరోధక చర్యల్లో భాగంగా ఐవిఆర్ఎస్ ద్వారా ప్రతి గర్భిణి, బాలింతను అప్రమత్తం చేస్తుందన్నారు. గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకు ఏ వారం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న సమాచారం 0124458000 నెంబరు ద్వారా వారానికోసారి ఉచితంగా కాల్ వస్తుందని చెప్పారు. ఇందులో మాతా, శిశు ఆరోగ్య సేవలు, టీకాల గురించి చెబుతారని, ఒక వేళ 14423 నెంబరుకు కాల్ చేసి వినొచ్చని చెప్పారు. డాక్టర్ లక్ష్మి దీప్ మాట్లాడుతూ బాలింత ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే ఏ విధమైన ఆహారం తీసుకోవాలనే దానితోపాటు వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలను వివరిస్తారన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, పిహెచ్ ఎన్.రత్నం, శేఖర్‌బాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలపై అవగాహన



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం అర్బన్ : ప్రతివ్యక్తీ పొందాల్సిన ధ్రువీకరణ పత్రాలపై న్యాయ విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు సూచించారు. న్యాయ సదనంలో ఎంపిఆర్ లా కాలేజీలో మున్సిపల్ అథారిటీస్, పంచాయతీ కార్యాలయం సిబ్బంది, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, రవాణాశాఖ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ, వాహనాల రిజిస్ట్రేషన్ లైసెన్స్ మంజూరు, భూముల రిజిస్ట్రేషన్ సమయంలో ప్రజలు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకునే విధానంలో లోపాలకు తావ లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలు, పెళ్లి రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు పొందడానికి ప్రభుత్వం నిర్దేశించిన పత్రాలు అందజేయడం ద్వారా సకాలంలో పొందడానికి వీలుంటుందని పేర్కొన్నారు. వాటిని జత చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. న్యాయవాది అన్నెపు భువనేశ్వరరావు మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా పొందాలని సూచించారు. వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇన్స్యూరెన్స్ ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. అలసత్వం వహించి నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదముందని హెచ్చరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెజ్జిపురం ఫాల్గుణరావు, న్యాయవాది ఇందిరాప్రసాద్, ఎంపీ ఆర్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ మోషే పాల్గొన్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం


కొత్తూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి సూచించారు. కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సచివలయ కన్వీనర్లతో, గృహసారథులతో, వాలంటీర్లతో గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయంతో ముందుకు వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్సీ పి.వి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. సమావేశంలో ఎఎంసి చైర్‌పర్సన్ గోగుల మాధవి, మండల కన్వీనర్ సరిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్‌లు కుంచాల రత్నాలు, ఎంపిటిసి జి.రత్నకుమారి, మొజ్జాడ చక్రపాణి, గోగుల వరప్రసాదరావు నాయుడు, మధుసూద నరావు, ఎల్.తిరుపతిరావు, ఎస్.తిరుపతిరావు, బి.శ్రీను, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరవేసే బాధ్యత మీదేనని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. గురువారం దేవపురం సచివాలయం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుత హ ప్రతి 50 ఇళ్లకు వెళ్లి జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు చేరుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో యర్ర చక్రవర్తి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న రెవెన్యూ సంఘం నాయకులు

న్యాయ సహకారం అందించాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాదిగా ఇటీవల నియమితులైన ఎం.వినయ్‌భూషణ్‌ను ఆయన కార్యాలయంలో ఎపి రెవెన్యూ సర్వీసులు సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. రెవెన్యూ తరపున న్యాయస్థానంలో నమోదవుతున్న కేసుల పరిష్కారానికి పూర్తి సహకారాన్ని అందించాలని ఆయనను కోరారు. అనంతరం ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. జిపిని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు, గార తహశీల్దార్ సనపల సుధాసాగర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- నౌపడ

గ్రామ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నౌపడ సర్పంచ్ పిలక బృందాదేవి అన్నారు. మండలంలోని నౌపడ పంచాయతీ టెక్కలి వీధిలో రూ.3 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణం జరుగుతున్న సిసి రోడ్డుకు గురువారం భూమి పూజ చేశారు. వడ్డితాండ్ర కొత్తూరులో జలజీవన్ మిషన్ ద్వారా రూ 33 లక్షలతో ఇంటింటికీ తాగునీరు అందించే ప్రక్రియలోభాగంగా కుళాయిల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ పిలక రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనరు కోత సతీష్ హన్నురావు, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఇచ్ఛాపురం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల పరిస్థితులపై తహశీల్దార్ గురుప్రసాద్ గురువారం పరిశీలించారు. పట్టణంలో మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలు, పంజా వీధిలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రం రూమ్ నంబర్ 3లో 733 ఓట్లు, రూమ్ నంబర్ 4లో 698ఓట్లు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత పరిస్థితిలో పోలింగ్ కేంద్రాలు ఎలా ఉన్నాయని పరిశీలించారు. కార్యక్రమంలో డిటి శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌పి ఫౌండేషన్ ఆర్థికసాయం

సరుబుజ్జిలి: రేపటి ప్రయోజనం (ఆర్‌పి) ఫౌండేషన్ మరోసారి గురువారం తమ దాతృత్వాన్ని చాటుకుంది. సారవకోట మండలం తాటిపరువుకు చెందిన సాధు ఈశ్వరరావు, అనురాధ దంపతులకు పుట్టిన శిశువు అరుదైన వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌పి ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. పుట్టిన పన్నెండు రోజులకే డయోగ్నైజుడు విత్ అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రర్స్ సింద్రోమ్ అనే అరుదైన వ్యాధివల్ల లక్షల్లో ఖర్చవుతోందని తల్లిదండ్రులు చెప్పారు. విశాఖపట్నంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించామని, ఆదుకోవాలని ఆర్‌పి ఫౌండేషన్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఫౌండేషన్ సభ్యులు తక్షణ సాయం కింద రూ.8 వేలు ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ప్రభు త్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, గొండు శ్రీనివాసరావు, బాన్న భార్గవ్, నూక కిరణ్, దివ్య, పావని పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి...

బూర్జ : ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంద నందికేశ్వరరావు కుటుంబ సభ్యులకు పాలకొండ నగర పంచాయతీ మాజీ చైర్మన్ పల్లా కొండలరావు, బల్ల వెంకటరమణ ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని తుడ్డలి వెళ్లి మృతుని భార్య సత్యవతి, తల్లి పోలమ్మలకు రూ.50 వేలు నగదు అందజేశారు. వీరితో పాటు సర్పంచ్ ప్రతినిధి అంపిలి గణపతిరావు, చౌదిరి నాయుడు, పట్టా శ్రీను, బత్తిలి మోహనరావు, సింగూరు తమ్మయ్య, రాము పాల్గొన్నారు.


సరుబుజ్జిలి : ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్ఐ కృష్ణప్రసాద్

శివారు భూములకు సాగునీరు అందిస్తాం

●ప్రతి ధాన్యం గింజా కొనే బాధ్యత ప్రభుత్వానిది ●మంత్రి సీదిరి అప్పలరాజు



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

శివారు భూములకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం నగరంపల్లిలో పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశ్వరరావు ఆధ్వర్యాన సర్పంచ్ దువ్వాడ పద్మావతి అధ్యక్షతన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ మదనగోపాలసాగరం పూర్తిగా లీకులమయంగా తయారైందని, వచ్చిన నీరు వచ్చినట్లే దిగువకు వథాగా పోతోందన్నారు. ఈ కారణంగానే నీరు శివారు భూములకు అందడం లేదన్నారు. మదనగోపాలసాగరం వద్ద బైపాస్ కాలువ నిర్మించి వంశధార శివారు భూములకు సాగునీటి అందిస్తే రైతుల ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి గొట్టాబ్యారేజీలో నీటి నిల్వ సామర్థ్యం పెంచాలనే ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ఒడిశాతో సమస్యలు ఉన్నందున ఆలస్యం అవుతోందన్నారు. రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను సిఎం జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు కానుకగా అందిస్తామన్నారు. రైతులు నుండి ఆర్‌బికెల ద్వారా నేరుగా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరూ ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం నమ్మవద్దన్నారు.

పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, ఎంపిటిసి ప్రతినిధి బమ్మిడి మోహనరావు మాట్లాడుతూ మూడేళ్లుగా వంశధార నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. శివరాంపురం రోడ్డు శంకుస్థాపన చేసి మూడేళ్లుగా రాళ్లు పరిచి పూర్తి చేయకపోవడంతో ఆ గ్రామానికి వెళ్లలేకపోతున్నామని, ఆ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణరాజు, పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ పద్మావతి, ఎంపిటిసి బమ్మిడి రాజేశ్వరి, మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యానాయుడు, తహశీల్దార్ బి.అప్పలస్వామి, సర్పంచ్‌లు కె.మల్లేశ్వరరావు, బాలరాజు, నర్తు లక్ష్మీనారాయణ, ఎ.గోపి, ఎం.భాస్కర రావు, జి.ఈశ్వరరావు, వడ్డి కరుణ, చింత హేమారావు, సుశీల, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు

రణస్థలం : ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని సంచాం పంచాయతీ సంచాం, పున్నానపాలెం తదితర గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, సంచాం సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం, ప్రతినిధి రెడ్డి రాము, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధనుంజయరావు, విద్యుత్‌శాఖ శ్రీనివాసరావు, ఎపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రణస్థలం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఉమాసుందరి

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

సంతబొమ్మాళి: అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎంపిడిఒ జి.ఉమాసుందరి అన్నారు.గురువారం మలగాం పంచాయతీ ఉదయపురం ఎంపిపి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం సరిగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆర్.హెచ్.పురం సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, సంతబొమ్మాళి కెజిబివిలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు.



కషాయం తయారు చేస్తున్న రైతులు

కషాయం తయారీ

ఆమదాలవలస: మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల యాంకర్ నక్క చిరంజీవి రైతులతో గురువారం అగ్నిస్త్రం కషాయాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కషాయం మొక్కజొన్న పంటకోసం తయారు చేశామని తెలిపారు. ఈ కషాయం మొక్కజొన్న పంటపై పిచికారీ చేయడం వల్ల కత్తెర పురుగు నివారణ అవుతుందని అన్నారు. అందువల్ల రైతులు ప్రకృతి సేద్య పద్ధతిలో పంటలను పండించాలని, దీనివల్ల మంచి దిగుబడి, నాణ్యమైన పంటను పొందవచ్చని తెలిపారు. రసాయనాలు ఉపయోగించి పంటలను పండించడం వల్ల నేల నిస్సారవుతుందని పేర్కొన్నారు. అలాగే పంట పెట్టుబడి పెరుగుతుందని తెలిపారు. రైతులంతా ప్రకృతి సేద్యంలో పంటలను పండించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, లక్ష్మి, మల్లేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంపై శిక్షణ

పోలాకి : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు విత్తన ఉత్పత్తి పథకంపై శిక్షణ అవసరం అని వ్యవసాయ అధికారి కె.సిహెచ్ వెంకటరావు అన్నారు. గురువారం మబగాం గ్రామ రైతు భరోసా కేంద్రంలో రబీ సీజన్‌కి సంబంధించి అపరాల సాగు, మెళకువలపై అవగాహన కల్పించారు. పెసలు, మినుములు, కందులు, ఉలవల్లో ఉండే పోషకాలను వివరించారు. తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి వచ్చే పంట అపరాలు అని చెప్పారు. అనంతరం పొలంబడి నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ సూర్యకుమారి, సైంటిస్ట్ అనూష, మండల వ్యవసాయాధికారి చిరంజీవి, మబగాం ఎఒ రోజారత్నం, తదితరులు పాల్గొన్నారు.



అపరాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వెంకటరావు



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ధాన్యం కొనాలని వినతి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని దీనబంధుపురం పంచాయతీ తమలాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని తహశీల్దార్ ఎన్.భాగ్యలక్ష్మిని కోరారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ సంక్రాంతి ముందు నూర్పు జరిగినా నేటికీ ధాన్యం కొనుగోలు కాక ఇబ్బందులు పడుతున్నామని, చేతిలో డబ్బులులేక పంటను అమ్ముకోలేక కనీస అవసరాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో రైతులు కణితి చంద్రయ్య, దివ్వల మాధవరావు, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై మెగా డ్రైవ్

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో పారిశుధ్యంపై మెగా డ్రైవ్ గురువారం నిర్వహించారు. కాలువల్లో పూడికలు తీసి బ్లీచింగ్ చల్లారు. చెత్త కుప్పలను తొలగించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పిలక బృందాదేవి పిఎసిఎస్ డైరెక్టర్ పిలక రవికుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, ఉప్పాడ ఉమాపతి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

బూర్జ : రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని సత్యసాయి సేవా సంస్థలు జిల్లా అధ్యక్షులు వై.లింగరాజు అన్నారు. బూర్జ ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలను, పెన్నులను, జామెంట్రీ బాక్సులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి అంటే ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సూచించిన పాఠాలను అవగాహన చేసుకుని పరీక్షల్లో పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, ఉపాధ్యాయులు, సమితి కన్వీనర్లు పాల్గొన్నారు.


గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రతినెలా సత్యసాయి సేవా సంస్థ గర్భిణులకు పౌష్టిక ఆహారాన్ని అందజేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎంపిపి కర్నేని దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు అన్నారు. బూర్జ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గర్భిణులకు బూర్జ, లక్ష్మపురం, చిన్నకురుంపేట భజన మండలులు సంయుక్త గురువారం మధ్యాహ్న భోజనం అందజేశారు. ప్రతినెలా 9న గర్భిణులకు ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం వస్తుంటారు. వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని వైద్యుల సలహాతో అందిస్తున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థలు జిల్లా అధ్యక్షులు వై.లింగరాజు, వైద్యులు రాజశేఖర్, పావని, పడాల ప్రసాద్, ఎం.జనార్ధనరావు, ఎం.అమ్మాయమ్మ, ఎస్.జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగరాజు

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



పనులను ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ అన్నారు. మండలంలోని చండిపుట్టుగ గ్రామంలో రూ.2 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజుతో కలిసి ఎంపిపి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో రహదారుల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ నుతులపాటి బాబురావు, వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, ఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, తదితరులు పాల్గొన్నారు.